

కలెక్టర్‌ను కలిసిన ఎంఎల్‌సి గోపీమూర్తి

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికల్లో విజయం సాధించిన గోపీమూర్తి కలెక్టర్‌ను తొలిసారి కలిశారు. గోపీమూర్తి కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి విద్యారంగం, విద్యార్థుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గోపీమూర్తి వెంట యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు పిఎస్.విజయరామరాజు, పెన్షనర్స్ నాయకులు పి.సీతారామరాజు ఉన్నారు.



కలెక్టర్‌కు మొక్కను అందిస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

గడ్డి పరకే కరువాయె..!

యంత్రాలతో వరి కోతల ఫలితమే

ట్రాక్టర్ గడ్డి ధర రూ.8 వేల నుంచి రూ.10 వేలు

మెట్టలో ట్రాక్టర్ గడ్డి రూ.12 వేలుపైనే

ఆందోళనలో పాడి రైతులు

ప్రజాశక్తి - భీమవరం

ఎండుగడ్డికి గడ్డుకాలం ఏర్పడింది. వరి పంటను యంత్రాల ద్వారా కోస్తుండటంతో గడ్డి కొరత తీవ్రమైంది. దీంతో గడ్డి ధర రోజురోజుకీ పెరుగుతోంది. జిల్లాలో ట్రాక్టర్ ధర రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. ఇదే మెట్ట ప్రాంతంలోనైతే రూ.12 వేలు పైబడి పలుకుతుందంటే గడ్డికి ఎంత డిమాండ్ ఉందో అర్థమవుతోంది. ఇప్పటికే దాణా ధరలతో సతమతమవుతున్న పాడి రైతులు ఎండు గడ్డి ధర పెరిగిపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఒకప్పుడు వ్యవసాయ భూమి ఉన్న ప్రతిఒక్కరికీ ఒకటో, రెండో పాడి గేదెలు ఉండేవి. ఒకపక్క వ్యవసాయం చేసుకుంటూనే మరోపక్క పాడి గేదెలను పెంచుకుంటూ దానిపై ఆధారపడి జీవిస్తుండేవారు. అయితే మారిన పరిస్థితులతో చాలామంది వ్యవసాయాన్ని, పాడి పరిశ్రమను వదిలేశారు. కేవలం కొద్దిమంది మాత్రమే వీటిని కొనసాగిస్తున్నారు. అయితే వ్యవసాయ రంగం మీదే ఆధారపడి ఉన్న పాడి పరిశ్రమ పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. ఈ నేపథ్యంలో అటు వ్యవసాయ రైతులు, ఇటు పాడి రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాలు, ఏలూరు జిల్లాలో 80 వేలకుపైగా ఎకరాల్లో రైతులు దాళ్వా సాగు చేపట్టారు. ఈ రెండు జిల్లాల్లో 50 శాతం మాసూళ్ల ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే వరి కోతకు యంత్రాలు ఉపయోగిస్తున్నారు. నూటికి 80 శాతం యంత్రాలపైనే వరి కోతలు పూర్తి చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎండుగడ్డికి కొరత ఏర్పడింది. సమయం, ఖర్చు ఆదా చేసుకునేందుకు ఎక్కువ మంది రైతన్నలు వరి పంటను యంత్రాల ద్వారా కోస్తుండటంతో గడ్డి కొరత తీవ్రమైంది.



వరికోత యంత్రంతో కోసి పొలంలోనే చుట్టలుగా చుట్టిన ఎండుగడ్డి


ఈ నేపథ్యంలో జిల్లాలో ట్రాక్టర్ గడ్డి ధర రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు విక్రయిస్తున్నారు. అదే మెట్ట ప్రాంతంలోనైతే రూ.12 వేల నుంచి రూ.13 వేలకుపైగా పలుకుతోందని రైతులు చెబుతున్నారు. మెట్టప్రాంత పాడి రైతులు ఎండుగడ్డి కోసం పరుగులు తీస్తున్నారు. ఉంగుటూరు, గణపవరం, నిడమర్రు, తాడేపల్లిగూడెం తదితర ప్రాంతాల నుంచి మెట్ట రైతులు వరిగడ్డిని దిగుమతి చేసుకుంటున్నారు. అయితే దీన్ని అదునుగా చేసుకున్న కొంతమంది దళారులు ఎండుగడ్డిని అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇప్పటికే పాడి పరిశ్రమ అంతంతమాత్రంగానే ఉంది. దాణా ధరలు అధికంగా ఉండటంతో మూగజీవాలను పెంచేందుకు పాడి రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాల ధర అధికంగా ఉన్నప్పటికీ దాణా ధర రెట్టింపు కావడంతో గిట్టుబాటు కాని పరిస్థితి ఉంది. దీంతో పాడి రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. దీంతో ఎండుగడ్డి ధర మండిపోతుంది. దీంతో పశువుల పెంపకం కష్టంగా ఉందని పాడిరైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆకాశాన్నంటిన ఎండుగడ్డి ధర

గతంలో వరి మాసూళ్ల ప్రక్రియ పూర్తయిన తర్వాత రైతులు వారి అవసరాలకు మినహాయించుకుని మిగిలిన గడ్డిని సాటి రైతులకు ఉచితంగా ఇచ్చేవారు. అయితే ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించట్లేదు. ఎండుగడ్డి ధర ఆకాశాన్నంటడంతో మరింత డిమాండ్ పెరిగింది. డెల్టా ప్రాంతంలో ఎండుగడ్డి ధర ఒకలా, మెట్టప్రాంతంలో మరోలా పలుకుతుంది. పశ్చిమగోదావరి జిల్లాలో ఎకరం ఎండుగడ్డిని రైతుల నుంచి దళారులు రూ.1000 నుంచి రూ.1500 వరకు కొనుగోలు చేస్తున్నారు. ట్రాక్టర్ కిరాయికి రూ.1500, గడ్డి లోడు చేసేందుకు కూలీలకు రూ.1500 వెచ్చిస్తున్నారు. మొత్తంగా ఎకరానికి రూ.4 వేల నుంచి రూ.5వేలలోపు ఖర్చవుతోంది. అయితే ట్రాక్టర్ గడ్డిని రూ.8 వేల నుంచి రూ.పది వేల వరకు విక్రయిస్తున్నారు. ఇదే మెట్ట ప్రాంతంలోనైతే ట్రాక్టర్ గడ్డి రూ.12 వేల నుంచి రూ.13 వేలకుపైగా విక్రయిస్తున్నారు. మరికొంత మంది అయితే రూ.15 వేల వరకు అమ్మకాలు సాగిస్తున్నారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

కలెక్టర్ నాగరాణి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - ఆచంట

రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. మంగళవారం ఆచంట వేమవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి జక్కంశెట్టి చంటి అధ్యక్షతన గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూబదలాయింపులు కాకుండా ప్రతిఒక్కరూ భూములను విక్రయించినా, ఇతర కారణాలతో బదలాయింపు చేసినా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. భూహక్కుల వివరాలను గ్రామాల్లో ప్రజలకు అధికారులు తెలియజేయాలని సూచించారు. రీసర్వే అడంగల్‌లో చేర్పులు, మార్పులు సర్వే నెంబర్లు తప్పుగా వేయడం, ఆర్ఎస్ఆర్ రికార్డులు, భూమి కొనుగోలు విక్రయాలు తదుపరి పేర్లు మార్పిడి, ఆక్రమణలు నిషిద్ధ భూముల జాబితా నుంచి తొలగించిన వాటి వివరాలు తెలుసుకోవడానికి రెవెన్యూ సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సదస్సుల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. అనంతరం వేమవరం పిహెచ్‌సిని కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పూజ మాట్లాడుతూ ఆసుపత్రిలో కనీస సౌకర్యాలు లేవని, కనీసం బాత్రూం కూడా లేదని తెలిపారు. హాస్పిటల్‌లో తుడిచేందుకు స్వీపర్ కూడా లేరని, తానే వచ్చి తుడుస్తున్నానని ఆమె కలెక్టర్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా పరిషత్ హైస్కూల్‌ను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఆచంట వేమవరంలో వర్షాకాలం వస్తే పంటలు ముంపునకు గురవుతాయని, దాళ్వా సాగుకు నీరందడం లేదని వాపోయారు. తక్షణమే ఎత్తిపోతల పథకాన్ని అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో నర్సాపురం ఆర్‌డిఒ దాసి రాజు, తహశీల్దార్ జి.కనకరాజు, ఎంపిడిఒ పూర్ణ బాబ్జి, సబ్ రిజిస్ట్రార్ కె.వెంకటపతిరాజు, ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి, వైస్ ఎంపిపి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

చలిగాలులు.. వర్షపు జల్లులు

ప్రజాశక్తి - పాలకొల్లు

డెల్టా ప్రాంతంలో మంగళవారం ఉదయం నుంచి వాతావరణం మారి చలిగాలులు వీస్తున్నాయి. దీంతో ప్రజలు బయటకు రావడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికితోడు సాయంత్రం నుండి చిరు జల్లులు పడుతూ కొద్దిసేపటి తర్వాత ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో రోడ్లపై జన సంచారం తగ్గింది. ఇంకా సార్వా మాసూళ్లు పూర్తి కావాల్సి ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



పాలకొల్లులో కురుస్తున్న వర్షం

డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలు పూర్తి

సాగునీటి సంఘాల ఎన్నికల్లో రెండోదశ పూర్తి

రెండు జిల్లాల్లో 28 డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నిక ఏకగ్రీవం

21న ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియలో రెండో అంకం ముగిసింది. ఏలూరు జిల్లాలో 14, పశ్చిమలో 14 మొత్తం 28 డిస్ట్రిబ్యూటరీ కమిటీల ఎన్నికలు మంగళవారం ముగిశాయి. అన్ని కమిటీల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. ఈ నెల 14వ తేదీన సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. ఏలూరు జిల్లాలో మేజర్, మైనర్, మీడియం మొత్తం 354 వాటర్ యూజర్స్ అసోసియేషన్ ప్రాదేశిక నియోజవర్గాలకు ఎన్నికలను నిర్వహించారు. వీటిలో మొత్తం 2,740 టిసిలకుగాను 2,621 మంది టిసిల ఎన్నిక ఏకగ్రీవమైంది. 10 మంది టిసిలను ఎన్నికల ప్రక్రియ ద్వారా ఎన్నుకున్నారు. మరో 109 టిసిలకు వివిధ కారణాలతో ఎన్నిక జరగలేదు. పశ్చిమగోదావరి జిల్లాలో మేజర్, మైనర్ మొత్తం 112 వాటర్ యూజర్స్ అసోసియేషన్ ప్రాదేశిక నియోజకవర్గాల పరిధిలో 1260 టిసిలు ఉన్నాయి. వీటిలో 1216 మంది టిసిల ఎన్నిక ఏకగ్రీవమైంది. మరో 44 టిసిలకు ఎన్నికలు పూర్తి కాలేదు. వాటర్ యూజర్స్ అసోసియేషన్ ఎన్నికలు పూర్తయిన రోజు మధ్యాహ్నం నుంచి ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ ఎన్నికలను అధికారులు పూర్తి చేశారు. ఎన్నికైన ప్రెసిడెంట్లు, వైస్ ప్రెసిడెంట్లు మంగళవారం జరిగిన డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు సంబంధించి అధ్యక్ష ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు.

ఏలూరు జిల్లాలో జరిగిన 14 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు సంబంధించి రిజర్వేషన్ ప్రక్రియ ప్రాతిపదికన ప్రతినిధులను ఎన్నుకున్నారు. ఈ నెల 21వ తేదీన ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు జరగనున్నాయి. పశ్చిమలో ఒకటి, ఏలూరు జిల్లాలో రెండు ప్రాజెక్టు కమిటీలు ఉన్నాయి. ప్రాజెక్టు కమిటీ ఎన్నికలు సైతం పూర్తయితే సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది.

బాలోత్సవం సన్నాహకాలు ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం

ఈ నెల 28, 29వ తేదీల్లో శ్రీ చింతలపాటి బాపిరాజు మెమోరియల్ హైస్కూల్‌లో జరగనున్న రెండో పిల్లల సంబరం బాలోత్సవం సన్నాహకాలు మొదలయ్యాయి. దీనిలో భాగంగా బాలోత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలకు దరఖాస్తు పత్రాలను అందజేశారు. ఈ పత్రాల్లో అకడమిక్, కల్చరల్ అంశాల్లో పోటీల నిర్వహణపై పాఠశాల యాజమాన్యాలకు వివరించారు. ఈ సందర్భంగా సిఎస్ఎన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ బాలల ఆధ్వర్యంలో బాలోత్సవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. పట్టణంలో అన్ని పాఠశాలల యాజమాన్యాలు, పిల్లలు ఈ బాలోత్సవంలో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతున్నారని నిర్వాహకులు తెలిపారు. భీమవరంలో జరుగుతున్న రెండో పిల్లల సంబరాలను జయప్రదం చేయాలని నిర్వాహక కమిటీ కోరింది.



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ప్రముఖులు



ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

బాలోత్సవం బ్రోచర్ ఆవిష్కరణ

ఈ నెల 28, 29 తేదీల్లో నిర్వహించబోయే భీమవరం బాలోత్సవాలు రెండో పిల్లల సంబరాల బ్రోచర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. స్థానిక డిఎన్ఆర్ కళాశాలలో కళాశాల అసోసియేషన్ ఉపాధ్యక్షులు పాండురంగారాజు, కార్యదర్శి గాదిరాజు బాబు 14 అకడమిక్, కల్చరల్ ఈవెంట్స్‌లో నిర్వహించే పోటీల బ్రోచర్లను ఆవిష్కరించారు.

ప్రశాంతంగా ముగిసిన నీటి పంపిణీ సంఘాల ఎన్నికలు

పంపిణీ సంఘాల అధ్యక్ష ఉపాధ్యక్షుల ఎన్నిక పూర్తి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పశ్చిమ డెల్టా నీటి పంపిణీ సంఘాల అధ్యక్షుల ఎన్నికలను పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ నెల 14న నిర్వహించిన నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికల్లో ఎన్నికైన అధ్యక్షుల ద్వారా మంగళవారం పశ్చిమ డెల్టా నీటి పంపిణీ సంఘాల అధ్యక్ష ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారు. నీటి పంపిణీ సంఘాల అధ్యక్ష ఉపాధ్యక్షులుగా డిపిఆర్‌వి.గోపాల రామకృష్ణంరాజు (అర్ధవరం), అడ్డా నాగరాజు (నరసాపురం), గుబ్బల మర్రాజు, అందే రామకృష్ణ (తణుకు), పెండ్యాల వైఆర్ రామకృష్ణంరాజు, కూసంపూడి శ్రీనివాస్ (భీమవరం) రుద్రరాజు పుల్లంరాజు, జక్కంపూడి సతీష్ (వీరవాసరం), ఆకుల లీలా కృష్ణమూర్తి, ఇర్రింకి బలరామమూర్తి (ఉండి), తోట ఫణిబాబు, మంతెన సాయి లచ్చిరాజు (అత్తిలి), నల్లూరి సురేష్‌కుమార్, గాదిరాజు వెంకట కృష్ణసత్యనారాయణరాజు (అనాకోడేరు), కునాధరాజు మురళీ కృష్ణంరాజు, మల్లాది గాయత్రి (పెంటపాడు), బండారు వెంకట్రావు, మల్ల శ్రీరామమూర్తి (పెనుమంట్ర), వెలగల బుల్లిరామిరెడ్డి, మల్ల శ్రీరామమూర్తి (పాలకొల్లు), పెన్మెత్స రామభద్రరాజు, దేవళ్ల ఎస్ఎన్ రామకోటి మోహన్ (ఆకివీడు), గోకరాజు వెంకట శివరామరాజు, మోటుపల్లి సుబ్బారావు (మార్టేరు), జక్కంశెట్టి సత్యనారాయణ, ఇంటి శ్రీరాముడు (సిద్ధాంతం), తమ్మినీడి రామకృష్ణ వరప్రసాద్, బొబ్బిలి శ్రీనివాసరావు ఎంపికయ్యారని కలెక్టర్ తెలిపారు.



'రైతు శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తాం'

నూతన డిసిలకు అభినందన



ఉండి : తోట ఫణిబాబు, మంతెన సాయి లచ్చిరాజును సత్కరిస్తున్న రైతులు


ప్రజాశక్తి - ఉండి

రైతుల శ్రేయస్సే లక్ష్యంగా పనిచేసి ఉండి ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజు నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని ఉండి డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు తోట ఫణి బాబు, ఉపాధ్యక్షులు మంతెన సాయి లచ్చిరాజు అన్నారు. మంగళవారం ఉండి జలవనరుల శాఖ కార్యాలయంలో నిర్వహించిన డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఎన్నికలలో 9 మందిని సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ప్రత్యేక ప్రణాళిక అధికారి కంటిపూడి శ్రీనివాసరావు తెలిపారు. ఈ ఎన్నికలలో డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులుగా సీసలి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు తోట ఫణి బాబు, ఉపాధ్యక్షులుగా ఉండి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు మంతెన సాయి లచ్చిరాజు, సభ్యులుగా పెదఅమిరం నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు కోరా రమణ, కోపల్లె నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు కోటపల్లి రాధాకృష్ణ రాజు, కోలనపల్లి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు గోకరాజు శ్రీనివాసరాజు, కాళ్ల నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు మొగళ్ల మాధవరావు, బొండాడ నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు మండపాటి కృష్ణమూర్తి, ఎల్ఎన్ పురం నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షులు అల్లూరి దొరయ్య, మాలవానితిప్ప నీటి సంఘం అధ్యక్షులు మంతెన వెంకట సత్య సూర్య నారాయణ రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కంటిపూడి శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం తోట ఫణి బాబు, మంతెన సాయిలచ్చిరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం నీటి వినియోగదారుల సంఘంను నిర్లక్ష్యం చేయడంతో రైతులకు, ప్రజలకు అవసరమైన సాగు, తాగునీరు అందించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. పంట కాలువల ప్రక్షాళన, డ్యామ్‌ల షట్టర్లు బాగు చేయించకపోవడం వంటి వైఫల్యాలు ఉన్నాయని, వీటన్నింటిని అధిగమించి రైతులకు, ప్రజలకు అవసరమైన సాగు, తాగునీరు అందించి, వారి శ్రేయస్సే లక్ష్యంగా పనిచేస్తామని అన్నారు. తమపై నమ్మకం ఉంచి, బాధ్యతలు అప్పగించిన ఎంఎల్‌ఎ కనుమూరి రఘురామకృష్ణంరాజుకు, తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న నీటిపారుదల సంఘం అధ్యక్షులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎన్నుకున్న అధ్యక్షులను టిడిపి మండల అధ్యక్షులు కరిమెరక నాగరాజు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించి అభినందనలు తెలిపారు.



నరసాపురం : నూతన డిస్ట్రిబ్యూటరీ కమిటీని అభినందిస్తున్న రామరాజు

నరసాపురం : పట్టణంలోని ఇరిగేషన్ కార్యాలయంలో మంగళవారం సాగునీటి డిస్ట్రిబ్యూటర్(డిసి) ఎన్నికను నిర్వహించారు. నియోజకవర్గంలోని ఆరు సాగునీటి సంఘాల ఆధ్యక్షులు ఈ ఎన్నికలో పాల్గొన్నారు. డిస్ట్రిబ్యూటర్ అధ్యక్షులుగా రామన్నపాలెం సాగునీటి సంఘం అధ్యక్షులు గుబ్బల మార్రాజు పేరును శాంతరాజు ప్రతిపాదించారు. డిసి ఉపాధ్యక్షులుగా రుస్తుంబాద సాగునీటి సంఘం అధ్యక్షులు అందే రామకృష్ణ పేరును ఎం.రత్నరాజు ప్రతిపాదించారు. ఎన్నికల అధికారిగా జిల్లా సర్వేయర్, ల్యాండ్ రికార్డు అధికారి కొండా జాషువ వ్యవహరించారు. నూతన కమిటీని టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, సంఘం అధ్యక్షులు అడ్డాల శ్రీను, కడలి మోహన్, డిఇ వెంకటనారాయణ, ఎఇ మోహన్, జక్కం శ్రీమన్నారాయణ, వాతాడి ఉమా, యర్రంశెట్టి నాగేశ్వరరావు అభినందించారు.



ఆకివీడు : డిసి ఛైర్మన్‌గా ఎన్నికైన గోకరాజు శివరామరాజు

వీరవాసరం : నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షుడుగా మత్స్యపురి నీటి సంఘం అధ్యక్షులు ఆకుల లీలాకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు బిజెపి మండల అధ్యక్షుడు కోడి నర్సింహం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిజెపికి చెందిన లీలాకృష్ణ కూటమి అభ్యర్థిగా ఏకగ్రీవం అయినట్టు తెలిపారు. కమిటి ఛైర్మన్‌గా ఏకగ్రీవానికి కృషి చేసిన కూటమి నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆకివీడు : మండల నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌గా ఏలూరుపాడు నీటి సంఘం అధ్యక్షులు గోకరాజు మురళీకృష్ణ ఎంపికయ్యారు. ఆరుగురు సభ్యులు ఉన్న ఈ సంఘం ఎన్నికలు మంగళవారం స్థానిక నీటిపారుదల శాఖ కార్యాలయంలో జరిగాయి. ఈ ఎన్నికల్లో మురళీకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం మురళీకృష్ణను సభ్యులు ఘనంగా సత్కరించారు.


పాలకొల్లు : పాలకొల్లు ప్రాంత నీటి సంఘాల డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌గా పోడూరు మాజీ ఎంపిపి పెనుమత్స రామభద్రరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం పాలకొల్లులోని ఇరిగేషన్ కార్యాలయంలో జరిగిన నీటి సంఘాల అధ్యక్షుల సమావేశంలో రామభద్ర రాజును నియోజకవర్గానికి చెందిన పలువురు నీటి సంఘాల అధ్యక్షుల డిసిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, రైతులు మాజీ ఎంపిపి రామభద్రరాజు రైతులకు చేసిన సేవలను కొనియాడారు.

భావితరాల కోసం ఇంధనం ఆదా

ఎలక్ట్రికల్ ఇఇ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

భావితరాల భద్రత కోసం ఇంధనాన్ని ఆదా చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎలక్ట్రికల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక సర్ సివి.రామన్ స్కూల్లో విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా శ్రీ విజ్ఞాన వేదిక సహకారంతో విద్యుత్ శాఖ అధ్వర్యంలో అవగాహనా సదస్సు, విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇంధన పొదుపు అందరి బాధ్యత అని, ఇంధనాన్ని ఆదా చేయడంలో ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. ఎలక్ట్రికల్ అసిస్టెంట్ ఇంజినీర్ కె.రాంబాబు మాట్లాడుతూ అవసరం మేరకే విద్యుత్‌ను వినియోగించాలని, ఎల్ఇడి, సోలార్ బల్బుల వినియోగం వల్ల విద్యుత్ ఆదా అవుతుందన్నారు. ప్రతిఒక్కరూ వీలైనంత మేర విద్యుత్‌ను ఆదా చేసే స్టార్ రేటెడ్ ఉపకరణాలను ఉపయోగించాలన్నారు. స్కూల్ ప్రిన్సిపల్ పెండ్యాల సరిత, విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రేపటి భవిష్యత్తు కోసం ఇంధన పొదుపు చాలా అవసరమని, ఇంధనాన్ని కనీసం 30 శాతం పొదుపు చేసే అవకాశం ఉందని అన్నారు. అనంతరం ప్రతిజ్ఞ మూడు పాఠశాలల్లో 126 మంది విద్యార్థులకు పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి 20న జరిగే ముగింపు వేడుకల్లో బహుమతులను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పి.పద్మ, కె.రాము, ఎం.శ్రీనివాసరాజు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న వెంకటేశ్వరరావు

పెన్షనర్ల హక్కుల సాధనకు కృషి చేస్తా

ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్‌సి గోపీమూర్తి

భీమవరం: పెన్షనర్ల హక్కులు, డిమాండ్ల సాధన కోసం తన వంతు సహాయ సహకారాలు అందించి కృషి చేస్తానని ఉభయగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి అన్నారు. ఎపి స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ భీమవరం యూనిట్ ఆధ్వర్యంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని ఎన్ఎస్ఎస్ పాల్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎల్‌సి గోపీమూర్తి పాల్గొని మాట్లాడారు. పెన్షన్ అనేది ఉద్యోగి ప్రాథమిక హక్కు అన్నారు. ఎవరి దయా బిక్ష కాదన్నారు. పెన్షన్ గత సేవలకు ప్రతిఫలం మాత్రమే అన్నారు. పెన్షన్ రద్దుచేసే అధికారం ఏ ప్రభుత్వానికి లేదని పేర్కొన్నారు. తన గెలుపుకు పెన్షనర్స్ ఎంతో కృషి చేశారని తెలిపారు. వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నామని చెప్పారు. తొలుత డిఎస్ నకార, వైవి.చంద్రచూడ్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఉప ఖజానా అధికారి అల్లూరి రవివర్మ మాట్లాడుతూ పెన్షనర్స్‌కు ఏ సమస్య వచ్చినా తనవద్దకు నేరుగా రావచ్చని, ఎల్లప్పుడూ తాను అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. అనంతరం 9 మంది సూపర్ సీనియర్ పెన్షనర్స్ దండు తమ్మిరాజు, పి.సూర్యనారాయణ రాజు, కలిదిండి గోపాలకృష్ణంరాజు, మంతెన సత్యనారాయణ రాజు, విప్పర్తి అన్నపూర్ణమ్మ, కె.మోజెస్, డి.నాగముని, జి.విశ్వనాథం, ఎంఎస్ఎన్.రాజులను సత్కరించారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు విజయరామరాజు, గౌరవ అధ్యక్షులు పట్టాభిరామయ్య, కోశాధికారి సూర్యనారాయణ, రవిప్రసాద్ పాల్గొన్నారు.



పెన్షనర్స్‌ను సన్మానిస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

ముగిసిన ఫుట్‌బాల్ పోటీలు

విజేతలకు బహుమతులు ప్రదానం

నరసాపురం: మండలంలోని స్వర్ణాంధ్ర కాలేజీలో గత రెండు రోజులుగా జెఎన్‌టియు సెంట్రల్ జోన్ ఇంటర్ కాలేజీల ఫుడ్ బాల్ పోటీలు మంగళవారంతో ముగిసాయి. ఈ పోటీల్లో విన్నర్‌గా భీమవరం విష్ణు కాలేజీ టీమ్, రన్నర్‌గా రాజమండ్రి గైట్ కాలేజీ, మూడవ స్థానంలో కాకినాడ ఆదిత్య, నాల్గవ స్థానంలో సిఆర్ రెడ్డి ఏలూరు కాలేజీ జట్లు నిలిచాయి. విజేతలకు ఆర్‌డిఒ దాసిరాజు, కళాశాల ఛైర్మన్ కె.సత్యనారాయణ, కోశాధికారి కొండేటి త్రినాథ్, డైరెక్టర్ శ్రీహరిలు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ దేశానికి పేరు తెచ్చే విధంగా నేటి యువత క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడల్లో నైపుణ్యం పెంచుకుని దేశ, అంతర్జాతీయ స్థాయిల్లో ఎదిగేలా ప్రయత్నించాలన్నారు. గెలుపు, ఓటమిలను క్రీడాకారులు సమానంగా తీసుకోవాలన్నారు. క్రీడల్లో ప్రావీణ్యం సాధించి మంచి స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగ అవకాశాలు వస్తాయన్నారు. ఈ పోటీల్లో 17 కాలేజీలకు చెందిన 350 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సురేశ్ కుమార్, పీటీ కొండ పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న ఆర్‌డిఒ దాసిరాజు, స్వర్ణాంధ్ర యాజమాన్యం

కెపిపాలెం నార్త్, సౌత్‌లో నేడు రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని కేపీ పాలెం నార్త్, కేపీ పాలెం సౌత్ గ్రామాల్లో బుధవారం రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించనున్నామని తహశీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. ఆయా సభల్లో గ్రామంలో ఉన్న భూ సమస్యలను, తదితర వాటిని పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ గ్రామస్తులకు సూచించారు.

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

అత్తిలి : రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు జెసి టి.రాహుల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం అత్తిలి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద భూ సమస్యల పరిష్కారం నిమిత్తం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సదస్సులో పలువురు రైతులు నుంచి భూ సమస్యలు, పాస్ బుక్కు సమస్యలు, రీ సర్వే, మ్యుటేషన్ సంబంధించిన తదితర అంశాలపై పలువురు రైతులు నుంచి సుమారు 45 దరఖాస్తులు జెసి స్వయంగా స్వీకరించారు. ఆర్‌డిఒ ఖతీబ్ కౌసర్‌భానో, తహశీల్దార్ దశిక వంశీ పాల్గొన్నారు.

ఉండి: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ రీ సర్వే గ్రామసభ రెవెన్యూ సదస్సుల ద్వారా అర్జీదారులందరికీ సత్వర న్యాయం జరుగుతుందని ప్రత్యేక అధికారి, గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.వెంకటరమణ, ఉండి తహశీల్దార్ కె.నాగార్జున అన్నారు. మంగళవారం ఉండి మండలం మహదేవపట్నం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి వినతులు అందుకున్నారు. గ్రామ సర్పంచి వణిమా నాగ వెంకట సుబ్బలక్ష్మి శ్రీనివాస్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేవు కార్తిక్ పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని పేరుపాలెం నార్త్, పేరుపాలెం సౌత్ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభ నుంచి 69 వినతులు వచ్చాయని తహశీల్దార్ కె.రాజకిశోర్ తెలిపారు. భూమి సరిహద్దులు సర్వే మ్యుటేషన్, రికార్డుల సవరణ, శ్మశానవాటిక సర్వే, తదితర సమస్యలపై పేరుపాలెం నార్త్ నుంచి 33, పేరుపాలెం సౌత్ నుంచి 36 వినతులు అందాయని తహశీల్దార్ తెలిపారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

నరసాపురం: ప్రజల నుంచి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు ఉన్నాయని తహశీల్దార్ టి.రాజరాజేశ్వరి అన్నారు. మంగళవారం మండలంలోని కొప్పర్రు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు తహశీల్దార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రజలు, రైతుల నుంచి 53 వినతులు స్వీకరించారు. అనంతరం తహశీల్దార్ రాజరాజేశ్వరిని గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లి వరలక్ష్మి, ఆర్‌ఐ లక్ష్మినారాయణ, వికెఒ. కె.వినోద్ పాల్గొన్నారు.

పాలకోడేరు: భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని పాలకోడేరు తహశీల్దార్ ఎన్.వి.విజయలక్ష్మి అన్నారు. పెన్నాడ అగ్రహారం, విస్సాకోడేరు గ్రామాల్లో సర్పంచులు చిల్లా అనూష, బొల్ల శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. కుముదవల్లి గ్రామంలో 4, శృంగవృక్షంలో 73, గొరగనమూడిలో 10, పెన్నాడ అగ్రహారంలో 14, విస్సాకోడేరులో 23 చొప్పున మొత్తం 124 అర్జీలు స్వీకరించామన్నారు.

అంగన్వాడీ పిల్లలకు మొబైల్ ఆధార్ సేవలు

పెనుమంట్ర : మండలంలోని గ్రామాల్లో ఉన్న అంగన్వాడీ కేంద్రాల్లో నమోదైన మూడేళ్ల లోపు పిల్లలకు ఆయా అంగన్వాడీ సెంటర్లలో మంగళవారం మొబైల్ ఆధార్ సేవలు ప్రారంభం అయ్యాయి. ఈ మేరకు జుత్తిగ, నెగ్గిపూడి గ్రామాల్లో ఈ సేవలు 18, 19 తేదీల వరకు అందుతాయి. చిన్నారుల తల్లిదండ్రులు ఈ సేవలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈనెల 19, 20 తేదీల్లో మల్లిపూడి, సత్యవరంలో, 26, 27, 28 తేదీల్లో పొలమూరు, ఆలమూరు అంగన్వాడీ కేంద్రాల్లో అందుతాయని స్థానిక మండల ప్రజా పరిషత్ అధికారి బివివి.శర్మ తెలిపారు.


కాళ్లకూరులో షర్మిలారెడ్డి జన్మదిన వేడుకలు

ఘనంగా షర్మిల పుట్టినరోజు

కాళ్ల : రాష్ట్రంలో కాంగ్రెస్‌కి పూర్వ వైభవాన్ని తీసుకురావడానికి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి కృషి చేస్తున్నారని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పాతపాటి హరికుమార్ రాజు అన్నారు. కాళ్లకూరు గ్రామంలో ఉండి నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేటర్ సర్వీ వెంకట గోపాలకృష్ణంరాజు స్వగృహంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేకును కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు రాజకుమార్, పార్టీ మండల అధ్యక్షులు కొల్లి సత్య శ్రీనివాస్, సోదదిని గంగయ్య, వంశీ రెడ్డి, కొండ రాజేష్ కుమార్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై సర్పంచులకు అవగాహన

నరసాపురం : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ సమగ్ర అభివృద్ధిపై సర్పంచులకు అవగాహన కల్పించారు. ఎంపిపి సోని అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో గ్రామాల్లో చేపట్టాల్సిన పనులు, ఆర్థిక వనరులు, నిర్వహణ, పచ్చదనం పెంపు, విద్య, వైద్యం, పేదరికం నిర్మూలన తదితర అంశాలపై ఆరోడ్యూస్ ఎఐ లోకేశ్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జివిఎస్.రామకృష్ణంరాజు, సూపరింటెండెంట్ వీరభద్రరావు, ఇఒపిఆర్‌డి నాగేంద్ర కుమార్, గ్రామ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవం

పెనుమంట్ర : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో చిరకాలం పనిచేసి, పదవీ విరమణ చేసిన అనంతరం పెన్షనర్స్ అయిన వృద్ధులను ఆదరించిన ఘనత డిఎస్.నకారదని పెనుమంట్ర మండల పెన్షనర్స్ అధ్యక్షులు తామాద సత్యనారాయణ, కార్యదర్శి పాలా నాగరాజ ప్రసాదరావు అన్నారు. మంగళవారం మండలంలోని మార్టేరు రోటరీ క్లబ్ భవనంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవం జరిపారు. ఈ సందర్భంగా కార్యదర్శి ప్రభాత కార్యకలాపాల నివేదిక సమర్పించారు. పెన్షనర్స్ ఆరాధ్యులు డిఎస్ నకారికి నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో కోశాధికారి పి.శేషారెడ్డి, ఉపాధ్యక్షులు కె.సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం : పింఛన్ ప్రభుత్వం, యాజమాన్యం ఇచ్చే కానుక కాదు ఉద్యోగి హక్కుగా భావించాలని అఖిల భారత బీమా పింఛన్‌దారుల సంఘం నాయకులు గరికిపాటి బాబాయి శర్మ విజ్ఞప్తి చేశారు. జాతీయ పింఛనుదారుల దినోత్సవం సందర్భంగా ఆయన మంగళవారం ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ రంగ బీమా సంస్థలోని ఉద్యోగులకు కూడా ఇతర ప్రభుత్వ ఉద్యోగుల వలె పింఛను, వేతన సవరణలు వర్తింపచేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సాధారణ బీమా పెన్షన్‌దారులకు 30 శాతం ఫ్యామిలీ పెన్షన్ చెల్లించాలని, బీమా ప్రీమియంపై జిఎస్‌టిని పూర్తిగా తొలగించాలని కోరారు.

ఎస్‌సి వర్గీకరణ రద్దు చేయాలని వినతి

నరసాపురం: ఎస్‌సి వర్గీకరణ రద్దు చేయాలని, ఎస్‌సి ఉపకులాల వారిగా అధ్యయనం చేయాలని జాతీయ ఎస్‌సి కమిషన్ చైర్మన్ డాక్టర్ కిషోర్ మక్వానాకు నరసాపురం ఎస్‌సి న్యాయ పోరాట సమితి అధ్యక్షులు సోదదిని శ్రీధర్ వినతిపత్రం అందజేశారు. మంగళవారం అమరావతిలో జాతీయ ఎస్‌సి కమిషన్ బోర్డు ఛైర్మన్‌ను కలిశారు. అనంతరం ఎస్‌సి ఉద్యోగుల పదోన్నతులు, వర్గీకరణ అమలు విషయంలో మాలలు ఎదుర్కొంటున్న సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. దొండపాటి స్వామి, పొక్కల కిరణ్ పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

తణుకు: అభివృద్ధి, సంక్షేమం రెండు సమ పాళ్ళలో తీసుకెళుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు విజన్ 2047కి అనుగుణంగా ఆర్థికాభివృద్ధి సాధించాలని తణుకు ఎంఎల్ఎ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం టిడిపి కార్యాలయం వద్ద బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ మాట్లాడుతూ 24 మంది బాధితులకు దాదాపు రూ.22,49,487లు చెక్కులను అందించామన్నారు. కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

వికలాంగ క్రీడాకారులకు ఆర్థిక సాయం

తణుకు : వికలాంగులు మానసిక స్థైర్యంతో అన్ని రంగాల్లో ముందు ఉండాలని, క్రీడల్లో కూడా రాణించాలని తణుకు ఎంఎల్ఏ ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక ఎంఎల్ఏ క్యాంపు కార్యాలయం వద్ద పశ్చిమగోదావరి జిల్లా వికలాంగుల(డెబిలిటి) క్రీడా ఫెడరేషన్ సభ్యులకు వారి ఖర్చుల నిమిత్తం రూ.24 వేలు అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా వికలాంగుల(డెబిలిటి) క్రీడా ఫెడరేషన్ సభ్యులకు ఈనెల 18, 19 తేదీల్లో తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరులో జరుగుతున్న రాష్ట్ర 3వ డెఫ్ 20 క్రికెట్ టోర్నమెంట్ పోటీలకు హాజరౌతున్నారు. వీరి ఖర్చుల నిమిత్తం ఎంఎల్ఏ రూ.24 వేలు ఆర్థిక సహాయం అందిస్తూ టోర్నమెంట్‌లో విజయం సాధించాలని కోరారు. కార్యక్రమంలో తేతలి గ్రామానికి చెందిన ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ టి.రాము, కోశాధికారి ఆర్.ఉమా మహేష్, కె.వరప్రసాద్, ఓ.వి.ఆర్.రవిశంకర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించుకోండి

ప్రత్యేక అధికారి వేణుగోపాలరావు

ప్రజాశక్తి - ఆకివీడు

రైతులు ప్రతి ఒక్కరూ గ్రామ రెవెన్యూ సదస్సుల ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పీడీ వేణుగోపాలరావు సూచించారు. మంగళవారం మండలంలోని ధర్మాపురం, దుంపగడప గ్రామాలలో జరిగిన రెవెన్యూ సదస్సులలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ధర్మాపురంలో జరిగిన సదస్సులో రైతులు తమ పంట మురుగునీరు బయటకు వెళ్లే మార్గం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఏటా వేలాది రూపాయలు ఖర్చు చేసి మురుగునీటిని



బయటకు తోడుకుంటున్నామని, అవకాశాలు లేని పరిస్థితులలో పంట వదిలేస్తున్నామని వారు తెలిపారు. ఆ మేరకు అధికారులు అవిశ కాలవను పరిశీలించారు. సమస్య పెద్దదని ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. ఆ గ్రామ సదస్సులో అధికారులకు 12 ఫిర్యాదులు అందాయి. వాటిలో మూడు సమస్యలు పాసుబుక్ ఆర్‌ఒఆర్‌కు సంబంధించినవి, కొన్ని సర్వేకు సంబంధించి, మరికొన్ని ఇతర సమస్యలు అందాయి. దుంపగడపలో ఇళ్ల స్థలాల కోసం రెండు అనుమతి లేని రొయ్యల చెరువుతో ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించమని, ఒకటి సర్వే కోసం అలా 8 సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందాయని తహశీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు.

యుటిఎఫ్ నాయకులకు అభినందన

వీరవాసరం : యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎంపికైన పి.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, యుటిఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా ఎన్నికైన జివివి.రామానుజరావును మంగళవారం యుటిఎఫ్ వీరవాసరం మండల శాఖ అభినందనలు తెలిపింది. రామానుజరావు సంఘం తరుపున వివిధ హోదాలలో ఉపాధ్యాయ సంఘానికి సేవలందించడం జరిగింది. ఇదేవిధంగా జిల్లా కార్యదర్శిగా ఎంపికైన సిహెచ్.కుమార్ బాబ్జి, ప్రచురణ కమిటీ సభ్యులుగా నామినేటెడ్ చేయబడిన పుల్లారావుకు కూడా యుటిఎఫ్ మండల కమిటీ అధ్యక్షులు ఎన్.ప్రసాద్‌బాబు, ప్రధాన కార్యదర్శి ముద్రగళ్ల శ్రీనివాస్‌లు అభినందనలు తెలిపారు.

డ్రెయినేజీ పున: నిర్మించాలి

సిపిఎం ఆధ్వర్యాన జూనియర్ అసిస్టెంట్‌కు వినతి

ప్రజాశక్తి - తణుకు రూరల్

వేల్పూరు 9వ వార్డులో శిథిలావస్థలో ఉన్న డ్రెయినేజీ పున:నిర్మించాలని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు డిమాండ్ చేశారు. సిపిఎం గ్రామ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక పంచాయతీ వద్ద జూనియర్ అసిస్టెంట్ అంకం ప్రమీలకు సమస్యకు సంబంధించిన వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ నీరు పారుదలకు కొంత ఆటంకం ఏర్పడి దోమల వ్యాప్తి పెరుగుతుందన్నారు. అధికారులకు, ప్రజాప్రతినిధులకు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు. ఇప్పుడైనా సంబంధిత అధికారులు తక్షణం స్పందించి డ్రెయినేజీ పున: నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాసా వెంకటేశ్వరరావు, యండమూరి నాగేంద్ర, రుద్రాక్షల శ్రీనివాసు, మారిన చిన గణేష్ పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్లలో పరీక్షల ప్రశ్నాపత్రాలు

ఉరుకులు, పరుగుల్లో హెచ్‌ఎంలు

పెనుమంట్ర : ఎంకి పెళ్లి సుబ్బి చావుకి వచ్చినట్టు ఎక్కడో ఒక పరీక్ష పత్రం లీకు అయినట్టు వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం జరిగిన నేపథ్యంలో విద్యార్థుల పరీక్షల ప్రశ్నా పత్రాలు కాస్తా పోలీస్ స్టేషన్లోకి చేరాయి. సోమవారం నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదవ తరగతులు చదివే విద్యార్థులకు సెల్ఫ్ ఎస్సెస్మెంట్ (ఎస్ఎ) 1 పరీక్షలు జరగాలి. అయితే ఒక పేపర్ లీకు అయినట్టు సమాచారం రావడంతో విద్యాశాఖ ఆ పరీక్ష రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. మంగళవారం నుంచి శుక్రవారం వరకు జరిగే పరీక్షల పత్రాల బండిళ్లను ఆయా మండల కేంద్రాల్లో ఉన్న పోలీస్ స్టేషన్‌లకు తరలించింది. ఇదంతా యుద్ధ ప్రాతిపదికన స్థానిక పోలీస్ స్టేషన్‌లో భద్రపరిచారు. కాగా, మంగళవారం నుంచి ఏ పూట పేపర్ బండిల్స్ ఆ పూటే తీసుకు వెళ్లవలసి ఉంటుందని, కాంప్లెక్స్ హెడ్మాస్టర్, వారి ప్రతినిధి ఉదయం 8:15 నిమిషాలకు, మధ్యాహ్నం 12 :30 నిమిషాలకు స్థానిక పోలీస్ స్టేషన్‌కు వచ్చి పేపర్ బండిల్స్ తీసుకువెళ్లవలసిందిగా ఎంఇఒలు ఇద్దరూ ఆదేశించడంతో హెచ్‌ఎంలు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు.

దోమరహిత సమాజ స్థాపనకు కృషి చేయాలి

జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గులాబ్ రాజకుమార్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

లార్వా జనిత ప్రదేశాలు లేకుండా చేద్దాం, దోమరహిత సమాజ స్థాపనకు కృషిచేద్దామని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గులాబ్ రాజకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ప్రాంతీయ ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రి సూపరిటెండెంట్ డాక్టర్ ఎవిఆర్ఎస్.తాతారావుతో కలసి ఆసుపత్రి ల్యాబ్‌ను, ప్రసుతి, మేల్ వార్డులను పరిశీలించి పేషెంట్లతో మాట్లాడారు. అనంతరం పారిశుధ్య పర్యవేక్షకులతో కలసి ఆసుపత్రి ప్రాంగణంలోని డ్రెయినేజీలను పరిశీలించారు. కీటక నియంత్రణ చర్యలు రోజువారీగా చేయాలని, ఫాగింగ్ ఆపరేషన్ చేయించాలని తద్వారా దోమలు వృద్ధి చెందకుండా చూడవచ్చునని తెలిపారు. పట్టణ, ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులతో వెక్టర్ కంట్రోల్, హైజిన్ కార్యక్రమాల అమలుపై వైద్యాధికారులు డాక్టర్ కెఎస్.రవికుమార్, డాక్టర్ తనూజ, డాక్టర్ శ్రావ్యలకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లిగూడెం మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవి.లక్ష్మణరావు, ఆరోగ్య పర్యవేక్షకులు మంగతాయారు, పద్మ, ల్యాబ్ టెక్నీషియన్స్ ఎం.అదాం, పృధ్వీ, శంకర్ పాల్గొన్నారు.

లేహం ఫుడ్స్‌లో తనిఖీలు

ఉన్నతాధికారులకు నివేదిక

ప్రజాశక్తి - తణుకు రూరల్

చట్ట విరుద్ధంగా నిత్యం వందల సంఖ్యలో గోవులను వధిస్తూ జీవహింసకు పాల్పడటమే కాకుండా, కాలుష్యానికి దారితీస్తున్నట్లు ఆరోపిస్తూ స్థానికులు, గో సేవా సమితి సభ్యులు దపదఫాలుగా చేసిన ఆందోళనలతో ఎట్టకేలకు అధికారయంత్రాంగం కదలింది. రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు సోమవారం లేహం ఫుడ్స్‌లో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. పరిశ్రమలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పశువులను వధించడం ద్వారా వస్తున్న రక్తం, తోళ్లు, వాటి పొట్ట భాగం నుంచి వచ్చే వ్యర్థాలను ప్రాసెసింగ్ చేసే విధానం, బాధితులు ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలు అక్కడ ఉన్న పరిస్థితులను పరిశీలించారు.


లేహం ఫుడ్స్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

అనుమతులు ఇలా..


మండలంలోని తేతలి పరిధిలోని సత్యవాడ వేళ్లే రోడ్డులో ఆర్ఎస్ నెం.322/1ఎ, 2ఎ, 2సిలో లేహం ఫుడ్స్ ప్రయివేటు వారు గోదాము ఏర్పాటు కోసం ఢిల్లీకి చెందిన కొందరు వ్యక్తులు తేతలి పంచాయతీ నుంచి అనుమతులు తీసుకున్నారు. ఇక్కడ కేవలం మాంసం నిల్వచేసి ఇతర ప్రాంతాలకు ఎగుమతులు చేసేందుకు అనుమతులు పొందినట్లు సమాచారం. అయితే రానురాను ఇక్కడ గంటల వ్యవధిలోనే 100ల సంఖ్యలో పశువులను మాంసంగా మార్చేందుకు అనుమతులు కోరారు. అనంతరం ఇక్కడ అదే స్థాయిలో పరికరాలను కూడా ఏర్పాటు చేశారు. ఇది గోసేవా సమితి, గో సంరక్షణ సమితి సభ్యులకు తెలియడంతో ఇక్కడ గోవులను వధించే అవకాశం ఉండటంతో, దపదఫాలుగా ఆందోళనలు చేస్తూ వచ్చారు. అయితే పరిశ్రమకు అన్ని అనుమతులు ఉండటంతో అటు ఏ అధికారీ కన్నెత్తి చూసిన పరిస్థితి లేదు. ఇటీవల పెద్ద ఎత్తున గో సేవా సమితి సభ్యులు, స్థానికులు ఆందోళనలను తీవ్రతరం చేయడంతో ప్రభుత్వంలో కదలిక వచ్చింది. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులు ఎట్టకేలకు తనిఖీలు చేశారు. కాలుష్యానికి అవకాశాలు ఉన్నాయా లేదా, గోవధ చేస్తున్నారా లేదా అనే అంశాలను పరిశీలించారు. అనంతరం ఉన్నతాధికారులకు నివేధికలు పంపించనున్నారు.

ఒట్టిపోయిన వాటినే..

ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ ఒట్టిపోయిన ఆరోగ్యకరమైన గేదెలను ఇక్కడ వధించి, విదేశాలకు ఎగుమతులు చేస్తున్నట్లు సంస్థ యాజమాన్యం పేర్కొంటుంది. లేహం పరిశ్రమ గేదె మాంసాన్ని ఇతర దేశాలకు ఎగుమతి చేయడానికి అగ్రికల్చరల్ అండ్ ప్రాసెసింగ్ ఫుడ్ ప్రొడక్ట్స్ ఎక్స్‌పోర్టు డెవలప్మెంట్ అథారిటీ అనుమతితోనే ఈ పరిశ్రమ నడుపుతున్నట్లు సంస్థ చెబుతుంది. అంతేకాకుండా ఇక్కడ వధించిన మాంసాన్ని నేరుగా విదేశాలకు పంపించడానికి వీలులేదని, అందులోని శాంపుల్స్‌ని విశాఖపట్నంలోని క్వాలిటీ అనలిటికల్ ల్యాబ్‌లో పూర్తిస్థాయి పరీక్షల అనంతరం విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ కె.నరసింహారావు వివరించారు.

మహిళా రైతుకు అభినందన

వీరవాసరం : మండలంలోని కొణితివాడ గ్రామంలో కోడి మంగమ్మ అనే మహిళా రైతును జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందించారు. మంగళవారం ఆచంట రెవెన్యూ సదస్సులో పాల్గొని తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో ఒక మహిళా రైతు రోడ్డు పక్కన ధాన్యం దిగుబడి పడుతున్న దృశ్యం కలెక్టర్ కంటపడింది. దీంతో కలెక్టర్ వాహనం దిగి మహిళా రైతు వద్దకు వెళ్లి మాట్లాడారు. మీకు ఎన్ని ఎకరాల పొలం ఉంది, పంట బాగా పండిందా, ఏ వెరైటీ సాగు చేశారు, ఎకరాకు ఎంత దిగుబడి వస్తుంది అనే సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. మీరు పండించిన పంటను రైతు సేవా కేంద్రాల ద్వారా రైస్ మిల్లులకు విక్రయించుకోవాలని అన్నారు. ఒక బస్తాకు కాటా తూకంకి 40.600 గ్రాములు మాత్రమే తూకం వేయాలన్నారు. కష్టపడి పండించిన ధాన్యమును రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్ముకుని, లాభపడాలని మంగమ్మకు, పలువురు రైతులకు వివరించారు.


రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్

పట్టణాలకు ధీటుగా

పల్లెసీమల అభివృద్ధి : మంత్రి

యలమంచిలి : పోలవరం, అమరావతి రాష్ట్రానికి రెండు కళ్లని, పట్టణాలకు ధీటుగా పల్లె సీమలను అభివృద్ధి చేయడమే ఎన్‌డియే లక్ష్యమని రాష్ట్ర జల వనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని నేరేడుమిల్లి, పెనుమర్రు, కట్టుపాలెం, గుంపర్రు, శిరగారపల్లి గ్రామాల్లో రూ.కోటి 38 లక్షలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజలు, శిలాఫలకాలను మంత్రి నిమ్మల రామానాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు ఎట్టి పరిస్థితులలోనూ 2026 అక్టోబరు నాటికి పూర్తి చేసేలా లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా, జూలై నాటికి పూర్తిచేయాలని ఇంజనీరింగ్ బృందానికి సూచించామన్నారు. తహశీల్దార్ గ్రంథి నాగవెంకట పవన్ కుమార్, ఎంపిడిఒ ఎన్.ప్రేమాన్విత, పాల్గొన్నారు.